ప్రజాశక్తి
సోమవారం 3 ఏప్రిల్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సమస్యలు యథాతథం

◆ వికేంద్రీకరణ ఫలితాలు నామమాత్రం ◆ అభివృద్ధికి కానరాని ప్రణాళికలు
◆ కొత్త పనులకు నిధుల సమస్య ◆ మెరుగుపడని వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు
◆ అనకాపల్లి జిల్లాకు రేపటికి ఏడాది

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'ప్రజల అవసరాలు, ఆకాంక్షల మేరకు మనం మార్పు చేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా కలెక్టరేట్, ఎస్పి కార్యాలయం, మిగిలిన అధికార కేంద్రాలన్నీ ఒకేచోటకు వస్తాయి. కనీసం 15 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఇంటిగ్రేటెడ్‌గా ఏర్పాటు చేస్తే.. అన్ని కార్యాలయాలూ ఒకే చోట కనిపిస్తాయి. వీటికోసం ఎక్కడెక్కడో తిరగాల్సిన అవసరం ప్రజలకు లేకుండా ఒకేచోట ఉండేలా గొప్ప వ్యవస్థను తీసుకొస్తున్నాం' - 2022 ఏప్రిల్ 4న కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నమాటలివి. కానీ వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ప్రధాన సమస్యలు యథాతథంగానే ఉన్నాయి. చాలా కార్యాలయాలు ప్రజలకు ఆమడదూరంలో ఉన్నాయి.

కొత్త జిల్లా ఏర్పాటుతో జిల్లా కేంద్రం ప్రజలకు దగ్గరైంది. అధికార యంత్రాంగం పర్యవేక్షణ పెరిగింది.



అనకాపల్లి కలెక్టరేట్

స్పందనకొచ్చే సమస్యల్లో అత్యధికం పరిష్కారమవుతున్నాయి. అయితే, జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువైన కలెక్టరేట్, ఎస్పి కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం సమస్యగా వుంది. అనకాపల్లి జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోని శంకరం వద్ద కలెక్టరేట్, ఎస్పి కార్యాలయం వుండడంతో రాకపోకలకు అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు ఇక్కట్లుపడుతున్నారు. ప్రధాన రహదారికి దాదాపు కిలోమీటరు నడుచుకొని మిగతా 2లో..

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

వికేంద్రీకరణకు తగినట్లు జిల్లా సమగ్రాభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించలేదు. ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. సాగునీటి వనరులను మెరుగుపర్చలేదు. పరిశ్రమల అభివృద్ధికి తగిన కృషి చేయలేదు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలేదు. ప్రజల సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి తగిన ప్రణాళికలు తయారుచేసి, నిధులు కేటాయించి ఖర్చుచేసినప్పుడే వికేంద్రీకరణ ఫలితాలు ప్రజలకు అందుతాయి.

కె.లోకనాథం, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

నేటి నుంచి 'పది' పరీక్షలు

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి
◆ అమలుకానున్న 'ఒక్క నిమిషం' నిబంధన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సోమవారం నుంచి ఈ నెల 18 వరకూ జరుగనున్న పదో తరగతి పరీక్షలకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలి. విశాఖ జిల్లాకు సంబంధించి 29,286 మంది, అనకాపల్లి జిల్లాకు సంబంధించి 22,232 మంది పరీక్షలు రాయనున్నారు. వీరికిగాను విశాఖ జిల్లాలో 136, అనకాపల్లి జిల్లాలో 111 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలనూ విద్యార్థులు మిగతా 2లో..

సహకార సంఘాల బలోపేతానికి కృషి

జిల్లా సహకార శాఖాధికారి పిఎల్ఎన్.కిరణ్ కుమారి





ప్రజాశక్తి - **అనకాపల్లి** : వ్యవసాయాధారిత జిల్లాగా పేరొందిన అనకాపల్లిలో సహకార సంఘాల బలోపేతానికి తగిన ప్రణాళికలతో కృషి చేస్తున్నట్టు జిల్లా సహకార శాఖాధికారి పిఎల్ఎన్.కిరణ్ కుమారి తెలిపారు. జిల్లాలోని సంఘాల పనితీరును, చక్కెర కర్మాగారాల పరిస్థితిని 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

జిల్లాలో సహకార సంఘాల పరిస్థితి ఎలా ఉంది ?

జిల్లాలో 74 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 1500 పరస్పర సహాయక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 156 ఎయిడెడ్ కాగా 930 అనైడెడ్ సంఘాలు ఉన్నాయి. వీటిలో నిర్వహణలో ఉన్నవి 850. అలాగే బిసి వెల్ఫేర్‌లో 530 సంఘాలు ఉన్నాయి.

జిల్లాలో సహకార చక్కెర కర్మాగారాల పరిస్థితి ఎలా ఉంది ?

జిల్లాలో తుమ్మ పాల, చోడవరం, ఏటికొప్పాక, తాండవ సహకార చక్కెర కర్మాగారాలు మిగతా 2లో..

వైభవంగా సింహాద్రి అప్పన్న కల్యాణం

▶ వార్త 3లో..

భూతగాదాలో ఇరుగ్రూపుల దాడి

▶ వార్త 6లో..

జి 20 పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

▶ వార్త 8లో..

సిపిఎం నేత సుబ్బారావుకు అశ్రు నివాళి

- అంతిమయాత్రలో పాల్గొన్న వందలాది మంది



వందలాది మందితో సాగుతున్న సుబ్బారావు అంతిమయాత్ర

ప్రజాశక్తి - గాజువాక : **సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావుకు విశాఖ కార్మిక, శ్రామిక జనావళి అశ్రు నివాళి అర్పించింది. శనివారం రాత్రి ఓ ఆసుపత్రిలో సుబ్బారావు చనిపోయారన్న వార్త తెలిసి ఆదివారం ఉదయానికే ఆయన స్వగృహానికి పెద్ద సంఖ్యలో సిపిఎం, ఇతర వామపక్ష పార్టీల కార్యకర్తలు, కార్మికులు, పట్టణ ప్రముఖులు తరలివచ్చారు. అంతిమయాత్ర అశేష జనవాహిని నడుమ ఆదివారం గాజువాక ప్రాంతంలో సాగింది. వందలాది మంది తరలివచ్చి అశ్రు నివాళి అర్పించారు. సుబ్బారావు అంతిమయాత్ర శీలానగర్‌లోని ఆయన స్వగృహం నుంచి చిన్న గంట్యాడ శ్మశాన వాటిక వరకూ జరగ్గా ఎక్కడ చూసినా జనమే కనిపించారు.**

తొలుత శీలానగర్‌లో సంతాప సభ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ జిల్లాలోని వేలాది మంది కష్టజీవులకు ఆప్తమిత్రుడు సుబ్బారావు అని కొనియాడారు. నిత్య శ్రమజీవిని కోల్పోయామని అన్నారు. కాలనీ ప్రజల సమస్యలపై సుబ్బారావు నిరంతరం స్పందించారన్నారు. సమాజంలో నిస్వార్థంగా పనిచేసినప్పుడే ఆ వ్యక్తికి మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని, అలా పని చేసిన వ్యక్తే సుబ్బారావు అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ పని చేశారన్నారు. మాజీ ఎసిపి ఎకె.ఖాన్ మాట్లాడుతూ సుబ్బారావు ఎంత మంచివారో గుర్తు చేశారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నిజాయితీగల వ్యక్తి సుబ్బారావు అని అన్నారు. ఆయన అంటే ఎప్పటికీ తనలాంటి వారికి మిగతా 2లో..



నివాళ్లర్పిస్తున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, తదితరులు

నేటి నుంచి 'పది' పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి..) తీసుకురాకూడదు. స్కూలు యూనిఫాంతో హాజరుకాకూడదు. పరీక్షల నేపథ్యంలో ఆర్‌టిసి, పోలీసు శాఖలు పలు చర్యలు చేపట్టాయి. పరీక్షా సమయాల్లో ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు విశాఖ నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోరని, ఆ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా 9493336633 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

(మొదటి పేజీ తరువాయి..) ఉన్నాయి. వీటిలో తుమ్మపాల వివి రమణ సహకార చక్కెర కర్మాగారం లిక్విడేషన్‌లో ఉంది.

సహకార పనులతో పాటు మీ శాఖ చేస్తున్న ఇతర పనులు ఏంటి ?

ఇప్పటివరకు సహకార సంఘాల పనితీరునే మా శాఖ పర్యవేక్షిస్తూ వచ్చింది. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఫ్లాషి ప్రోగ్రామ్స్ నిర్వహిస్తోంది. వీటిని జిల్లా పశుసంవర్ధక శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సహకార శాఖల సమన్వయంతో చేపడుతోంది.

ఫ్లాషి ప్రోగ్రామ్స్‌లో ప్రధానంగా ఏ అంశంపై దృష్టి సాధించారు ?

ప్రధానంగా పైలెట్ ప్రోగ్రామ్‌గా జగనన్న పాలవెల్లువ కార్యక్రమం చేపట్టాం. పది మంది మహిళా పాడి రైతులతో ఒక గ్రూపు ఏర్పాటు చేసి పాల సేకరణ సంఘం ఏర్పాటు చేస్తున్నాం. గత ఏడాది మే 22న ప్రారంభించాం. రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో దీనిని అనకాపల్లి జిల్లాలో పైలెట్ ప్రోగ్రామ్‌గా నిర్వహిస్తున్నాం. ఇప్పటికి జిల్లాలో 192 అమూల్ సంఘాలు ఉన్నాయి. రోజుకు 20 వేల లీటర్ల పాలు సేకరిస్తున్నాం. స్థానిక డెయిరీల కంటే అదనంగా లీటరుకు పాల ధర చెల్లిస్తున్నాం.

ఈ సంఘాల ఏర్పాటు ఎలా చేస్తారు ?

గ్రామాల్లో సంఘాల్లో చేరదలుచుకున్న సభ్యులు 90 రోజులపాటు పాలు పోయాలి. అలా పోసిన వారిని సభ్యులుగా గుర్తిస్తాం. వారితో సొసైటీ రిజిస్ట్రేషన్ చేస్తాం. ఇంతవరకు జిల్లాలో 86 సొసైటీలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి.

ఆత్మ నిర్భర్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా ఎటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు ?

ఆత్మ నిర్భర్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో ఏడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో మల్టీ పర్పస్ గోడౌన్లలను నిర్మిస్తున్నాం. పోస్ట్ హార్వెస్టింగ్ అనంతరం రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర వచ్చే వరకు ఈ గోడౌన్లలో నిల్వ ఉంచుకోవచ్చు. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో జిల్లాకు 9 మంజూరు అయ్యాయి. వీటిలో ఇప్పటికే రెండు గోడౌన్ల నిర్మాణం పూర్తవగా మరో రెండు 70 శాతం పనులు పూర్తి చేసుకున్నాయి. రెండో దశలో మరో 19 మంజూరుకానున్నాయి.

మల్టీ పర్పస్ గోడౌన్ల నిర్వహణ ఎవరు చేస్తారు ?

ఈ మల్టీపర్పస్ గోడౌన్ల నిర్వహణ పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ, సహకార శాఖలు నిర్వహిస్తాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా, కమ్యూనిటీ సర్వీస్ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నాం. వీటి ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ కూడా ఉంటుంది. జిల్లాకు రెండు పెట్రోల్ బంకులు మంజూరు కాగా ఒకటి సెంట్రల్ బ్యాంక్ ద్వారా పాయకరావుపేటకు ఇచ్చాం. మరో రెండు పెట్టే ఆలోచన ఉంది.

జిల్లాలో పిఎసిఎస్‌ల ద్వారా వరి సేకరణ ఎలా జరుగుతోంది ?

జిల్లాలో 74 పిఎసిఎస్‌ల ద్వారా 2 వేలా 800 మెట్రిక్ టన్నులను 25 వేలా 700 మంది రైతుల నుంచి సేకరించాలని నిర్ణయించాం. ఇప్పటివరకు 60 పిఎసిఎస్‌ల ద్వారా 20 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరించాం.

మహిళా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సొసైటీస్ పెట్టే ఆలోచన ఉందా ?

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సొసైటీలను ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో పది సొసైటీలకు ప్రతిపాదనలు చేయగా ఏడు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. సహకార శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాం.

శాంతిని కాంక్షిస్తూ పరుగు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్‌లోని విశ్వ ప్రియా ఫంక్షన్ హాల్ నుంచి తెన్నేటి పార్క్ వరకూ 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో అహింసా రన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భారత నావికాదళ వైస్ అడ్మిరల్ కుమార్ నాయక్ హాజరై ఈ రన్‌ను ప్రారంభించారు. రన్‌లో 3 కిలోమీటర్ల విభాగంలో 500 మంది, 5 కిలోమీటర్ల విభాగంలో 400 మంది, 10 కిలోమీటర్ల విభాగంలో 320 మంది భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ ఆశిష్ దారివాల్, చీఫ్ సెక్రటరీ మహేంద్ర, ప్రాజెక్ట్ కన్వీనర్ వివేక్ దశాని పాల్గొన్నారు. విజేతలకు రూ.లక్షా 75 వేలు విలువైన బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

రాష్ట్రంలో కానరాని అభివృద్ధి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక ఎటువంటి పెట్టుబడులూ రాలేదని, అభివృద్ధి ఎక్కడా జరగలేదని, జాబ్ క్యాలెండర్ ఊసేలేదని టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్రానికి చేసిన మోసాన్ని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

సమస్యలు యథాతథం

వెళ్లాల్సివస్తోంది. బస్సు సౌకర్యం సరిగాలేదు. ప్రధాన కార్యాలయాలు వేర్వేరుచోట వున్నాయి. ఉన్న కార్యాలయాల్లో వసతుల్లేక ఇరుకుగదుల్లో అధికారులు, ఉద్యోగులు సర్దుకుపోతున్నారు. కొప్పాకలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, పరిశ్రమల కేంద్రం ఉన్నాయి. తుమ్మపాలలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలున్నాయి. ఇప్పటికీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతో ముడిపడి నీటిపారుదలశాఖ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, డ్వామా, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ శాఖ, పరిశ్రమల తనిఖీశాఖ, ఔషధ నియంత్రణ విభాగం, కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయాలున్నాయి.

అభివృద్ధి ఏదీ ?

వ్యవసాయం : వ్యవసాయాధారిత జిల్లా అయినప్పటికీ సాగునీటి వనరులను అభివృద్ధి చేయలేదు. సాధారణ పథకాలు, కార్యక్రమాలే తప్ప వ్యవసాయరంగ అభివృద్ధికి తగిన నిధుల కేటాయింపుల్లేవు, ఖర్చులేదు. దీంతో అదనపు ఆయకట్టుకు సాగునీరందించే పనేదీ జరగలేదు. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 10.59 లక్షల ఎకరాల్లో సాగుయోగ్యమైన భూమి ఆరు లక్షల ఎకరాలుంది. సాగునీటి వనరుల శాఖ సమాచారం ప్రకారం తాండవ, రైవాడ, కోణాం, పెద్దేరు, కళ్యాణపులోవ జలాశయాలు, చెరువుల కింద మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లభిస్తోంది. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తిచేసి, ఏలేరు కాలువ నీటిని సాగునీటికి మళ్లించగలిగితే మరో 4.73 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభిస్తుంది. రూ.17 వేల కోట్ల విలువైన సుజల స్రవంతికి 2022-23 బడ్జెట్లో రూ.297.50 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.141.79 కోట్లకు తగ్గించిన తీరు చూస్తుంటే సాగునీటివనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంలేదని అర్థమవుతుంది.

పరిశ్రమలు : కొత్తగా అచ్యుతాపురం సెజ్‌లో రూ.1250 కోట్లతో ఎటిసి టైర్ల కంపెనీ వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో గోవాడ మినహా మిగిలిన మూడు మూతపడ్డాయి. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునికీకరించి చెరుకు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చే పని ప్రభుత్వం ఈ ఏడాదికాలంలో చేయలేదు. జిల్లాకు చెందిన మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ మిన్నకున్నారు.

నిర్వాసితుల సమస్య : నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్ బేస్ (ఎన్‌ఎఒబి) భూసేకరణ, నిర్మాణాల్లో బతుకుదెరువు కోల్పోయిన మత్స్యకార, చేతివృత్తిదారులకు పరిహారం, ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించకపోవడంతో 2022 అక్టోబర్ 31 నుంచి ఆందోళన కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోకపోవడంతో ఎంతో కాలంగా ఈ సమస్య ఉంది. పెట్రోయూనివర్సిటీ నిర్మాణాలకు సమస్య తొలగిపోయిందని చెబుతున్నప్పటికీ, ఆ భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం ఇవ్వలేదు.

విద్య: ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో దాదాపు 330 ప్రాథమిక పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను కిలోమీటరు పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రభుత్వం విలీనం చేసింది. వచ్చే విద్యా సంవత్సరానికి పది మంది విద్యార్థుల్లోపున్న 151 ప్రాథమిక పాఠశాలలను మూసేయాలని ప్రభుత్వం చూస్తోంది.

వైద్యం : నాడు - నేడు కింద ఆసుపత్రుల భవన నిర్మాణాలపై చూపుతున్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు, మెరుగైన వైద్యం అందించడంపై ప్రభుత్వం చూపడంలేదు. 150 పడకల నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఏడాది కాలానికిపైగా లిఫ్ట్ పనిచేయడంలేదు. ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సర్జరీ సదుపాయాల్లేక కెజిహెచ్‌కు పంపిస్తున్నారు. మాకవరపాలెం మండలంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు ఇటీవల శంకుస్థాపన చేసినా పనుల్లో పెద్ద పురోగతిలేదు.

నాన్‌షెడ్యూల్ ప్రాంతం : తొమ్మిది నాన్ షెడ్యూల్ మండలాల్లోని 58 పంచాయతీల్లో 320 నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో 85 వేల మంది గిరిజనులున్నారు. రహదారి సౌకర్యంలేని గిరిజనులు స్వచ్ఛందంగా దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఆ గ్రామాలకు రహదారి, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలికసదుపాయాలు సమకూర్చడం లేదు. ఐదో షెడ్యూల్‌లో చేర్చే కనీస ప్రయత్నమూ జరగలేదు. నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటుచేయాలన్న ప్రధాన డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించడంలేదు.

సిపిఎం నేత సుబ్బారావుకు అశ్రు నివాళి


సుబ్బారావు పార్థివదేహం వద్ద నివాళర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు

భయమేనన్నారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం నాయకులు డి.ఆదినారాయణ, స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె.అయోధ్యరాం మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాడిన వ్యక్తి సుబ్బారావు అని కొనియాడారు. ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అధ్యతన జరిగిన ఈ సంతాప సభలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, నాయకులు ఎం.రాంబాబు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎం.రమేష్ కుమార్, లోకేష్, పద్మనాభరాజు, ఎస్.సుధాకర్, పి.వెంకటరెడ్డి, అక్కిరెడ్డిపాలెం, దశమకొండ, అప్పన్నకాలనీ, మింది, గాజువాక, ఆటోనగర్ ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. నివాళ్లర్పించిన వారిలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఆర్‌వి.నరసింహారావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతపూడి వెంకటరామయ్య, జివిఎంసి గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, ఎడిసి సన్యాసిరావు, గాజువాక ప్రాంతంలోని కార్పొరేటర్లు, అన్ని పార్టీల నాయకులు, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, ప్రజాశక్తి విశాఖ బ్రాంచి మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్‌ఆర్‌టియుసి ప్రధాన కార్యదర్శి మస్తానప్ప, టిఎన్‌టి యుసి నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, సిపిఐ నాయకులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు. సుబ్బారావు మృతికి బిహెచ్ ఇఎల్ నాయకులు జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాధరావు, కె.నారపరెడ్డి, జి.అచ్చం నాయుడు, కె.విజయకుమార్, పి.కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లకు మోక్షమెప్పుడో?

ఏడు రహదారుల విస్తరణకు ఏళ్ల క్రితం ఆమోదం
ఆచరణ ఆమడ దూరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఏడు చోట్ల రోడ్ల విస్తరణకు కొన్నేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలు అప్పటి ప్రభుత్వాల ఆమోదం పొందాయి. అయితే ఏళ్ళు గడుస్తున్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుతం సుమారు 40 నుంచి 60 అడుగుల మేర ఉన్న భీమిలి పోలీస్ స్టేషన్ నుంచి తగరపువలస జంక్షన్ వరకు ఉన్న రోడ్డును 80 అడుగుల వెడల్పు విస్తరించాలని అధికారులు చేసిన ప్రతిపాదనలను 2019లోనే అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్థానిక పోలీస్ స్టేషన్ వైజంక్షన్ నుంచి దొరతోట రోడ్డు, జెవి అగ్రహారం వరకు ఇప్పుడున్న సుమారు 40 అడుగుల రోడ్డును 100 అడుగుల వెడల్పు విస్తరించాలని అధికారులు చేసిన ప్రతిపాదనలను 2018లో అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఇప్పుడున్న 25 నుంచి 30 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 66 అడుగులు మేర వెడల్పు చేయాలని 2015లో ఆనాటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌బిఐ నుంచి బీచ్ రోడ్డు మీదుగా జెట్టీ గెస్ట్ హౌస్ వరకు ఇప్పుడున్న 20 నుంచి 30 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 60 అడుగుల వెడల్పు చేయాల్సి ఉంది. ఈ మేరకు 2015లోనే అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి గంట స్తంభం వరకు ఇప్పుడున్న సుమారు 20 నుంచి 25 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 66 అడుగుల మేర వెడల్పు చేయాలని 2015లో అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గంటస్తంభం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఇప్పుడున్న సుమారు 30 నుంచి 40 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 66 అడుగుల మేర వెడల్పు చేయాలని సంబంధిత అధికారులు చేసిన ప్రతిపాదనలకు 2015లోనే అప్పటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గతంలో వుడా, ప్రస్తుత వీఎంఆర్‌డిఎ, ఆర్ అండ్ బి, జివిఎంసి ఇలా వివిధ విభాగాల అధికారులు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలు రూపొందించారు. ఇలా రోడ్లను అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ నియంత్రణ మొదలు పట్టణ స్వరూపమే మారనుందన్న దూర దృష్టితో ప్రణాళికలు రచించారు. నానాటికీ పెరుగుతున్న ప్రజల అవసరాలు, జనాభా దృష్ట్యా పట్టణాలు, నగరాల్లో రోడ్ల అభివృద్ధి అవసరమే.

రోడ్ల అభివృద్ధికి అడ్డంకి నిధులు లేకనే?

సమృద్ధిగా నిధులు లేకనే మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి అడ్డంకిగా మారినట్లు చెప్పవచ్చు. రోడ్ల విస్తరణ చేసే క్రమంలో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు, నివాసాలు కోల్పోయిన వారికి మెరుగైన పరిహారం చెల్లించాల్సి ఉంది. రోడ్ల అభివృద్ధికి, నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు సమృద్ధిగా నిధులు అవసరం. రోడ్ల అభివృద్ధికి ఎంత ప్రాధాన్యం ఉందో, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులోనూ అంతే ప్రాధాన్యం ఇమిడి ఉంది.

రోడ్ల అభివృద్ధి అవసరమే

1861 ఫిబ్రవరి 9న ఏర్పడిన చారిత్రక భీమునిపట్నం పురపాలక సంఘం నేడు మహా విశాఖ నగరంలో విలీనమైనప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. జివిఎంసి ఒకటో జోన్ (భీమిలి) పరిధిలో ప్రస్తుత జనాభా 86,519 మంది ఉన్నారు. 58.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది. 52 మురికి వాడలు ఉన్నాయి. 37 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి అవసరమని ప్రభుత్వాలు గుర్తించాయి. అయితే నిధుల లభ్యత ఆధారంగా తక్షణం 7 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి అవసరమని అధికారులు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వాలు ఇప్పటికే ఆమోదం తెలిపాయి.



మాస్టర్ ప్లాన్ రోడ్లతో మహర్దశ

ఇప్పటికే ప్రభుత్వ ఆమోదం పొందిన 7 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధితో భీమిలికి మహర్దశ రానుంది. పెరుగుతున్న ప్రజల అవసరాలు, జనాభా దృష్ట్యా ముఖ్య ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి, విస్తరణ ఎంతైనా అవసరం. ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. ప్రజల సహకారం కూడా అవసరం.

దవళ శ్రీనివాసరావు
అసిస్టెంట్ సిటీ ప్లానర్
పట్టణ ప్రణాళిక విభాగం, జోన్-1

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : అప్పులు బాధ తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పరిధి గాంధీనగర్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... వాసుపల్లి వరలక్ష్మి(47) భర్త ఉమాపతితో కలిసి గాంధీనగర్‌లో నివాసముంటున్నారు. వరలక్ష్మి వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో నష్టం రావడం, అప్పులు తీర్చలేక మనస్థాపానికి గురై ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరలక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడాన్ని చూసిన పక్క ఇంటిలో వారు ఆమె భర్తకు సమాచారమిచ్చారు. భర్త ఉమాపతి ఫిర్యాదు మేరకు ఆరిలోవ సిఐ సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కంచరపాలెం : మద్యం మత్తులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన కంచరపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి కంచరపాలెం పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... బిర్లా జంక్షన్ వద్ద నివాసముంటున్న గుడి అప్పలరాజు (36) స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. అప్పలరాజు ఆదివారం మద్యం తాగి బిర్లా జంక్షన్ సాయినగర్ వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలోకి వెళ్లాడు. భవనంలో ఉన్న పిల్లర్‌పై పడిపోయాడు. పిల్లర్‌లోని రాడ్డు అతడి ఎడమ పిరుదు భాగం లోపలికి దూసుకుపోయింది. స్థానిక యువకులు గమనించి కట్టర్ సహాయంతో రాడ్డును రెండు వైపులా కట్‌చేసి చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పలరాజు భార్య గుడి లావా ఫిర్యాదు మేరకు సిఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెచ్‌సి ఎస్.సుజేశ్వరి కేసు దర్యాప్తు చేపట్టారు.



ప్రశంసాపత్రం అందుకున్న గీతిక తదితరులు

ఘనంగా 'నారాయణ' వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : నారాయణ స్కూల్ మధురవాడ బ్రాంచి వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ రేష్మా రేజ్వానా ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా 2022-23 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. 8వ తరగతి సిబిఎస్‌ఇలో ఉత్తమ ప్రతిభ చూపిన రఘుపతి గీతికకు కో-ఆర్డినేటర్ శివప్రతాప్ ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం రాజ్‌కుమార్, రీజనల్ ఇన్‌ఛార్జి రఘుబాబు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'సేవా స్ఫూర్తి' వితరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు, బిఎన్ఆర్‌నగర్‌లో వృద్ధ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. భార్య నాగరత్నం పక్షవాతంతో కదలలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. భర్త ఐలయ్య వృద్ధాప్యం, అనారోగ్యంతో ఒక రేకుల ఇంట్లో జీవనం సాగిస్తూ సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న సేవా స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు ఆదివారం వృద్ధ దంపతులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో పాత్రుడు, అప్పలరాజు, ఇమంది లక్ష్మణరావు, నమ్మి గణేష్, ఒమ్మి మోహన్ పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ పంచరాత్రి జాతర

ప్రజాశక్తి - ఆరిలోవ : జీవీఎంసీ 9వ వార్డు పరిధి సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారి పంచ రాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులు తేజశర్మ పర్యవేక్షణలో కుంకుమార్చనలు జరిపించారు. అనంతరం అన్నసమారాధ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు తూర్పు నియోజకవర్గ వైసిపి నాయకులు అక్కరమాని వెంకట్రావు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పొట్టి శ్రీరాములు జివిఎంసి హైస్కూల్ నుంచి టెన్త్ పరీక్షలకు హాజరు కానున్న 52 మంది విద్యార్థులకు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు అట్ట, స్కేలు, పెన్సిల్, రబ్బరుతో కూడిన సామాగ్రిని అందజేశారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థి సాయి కృష్ణకు జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సింహాచలం, సంస్థ గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు పాల్గొన్నారు

కంప్యూటర్ సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కస్తూరిబా గాంధీ బాలికల ఇంటర్మీడియట్ విద్యార్థులకు కంప్యూటర్ కోర్స్ (ఎంఎస్ ఆఫీస్) సర్టిఫికెట్లను జన శిక్షణ సంస్థ డైరెక్టర్ రామరాజు అందజేశారు. జన శిక్షణ సంస్థ ఆధ్వర్యాన ఇంటర్మీడియట్ విద్యార్థులు 40 మందికి మూడు నెలలు శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్క విద్యార్థి శిక్షణకు రూ.300 ఫీజును జన కులం ఫౌండేషన్ అందించింది. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి చంద్రకళ, జన శిక్షణ సంస్థ డైరెక్టర్ నాయుడు, జన కులం ఫౌండర్ సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత పోలమాంబ జట్టు

ప్రజాశక్తి -తగరపువలస : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని పాత బస్టాండ్ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన 2023 వార్షిక లీగ్ పోటీల్లో చిట్టివలస పోలమాంబ జట్టు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. నగరానికి చెందిన దుర్గాలమ్మ జట్టుపై 1-10 గోల్స్ తేడాతో విజయం సాధించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతగా నిలిచిన పోలమాంబ జట్టును అభినందించారు. విజేతలకు ట్రోఫీని, రూ.50 వేలు నగదు బహుమతిని అక్కరమాని చినబాబు అందజేశారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న కల్యాణం



అప్పన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారిని ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపారు. ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం కోలాటోత్సవం, ఎదురు సన్నాయోత్సవం అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో దేవస్థానం ఈవో వి.త్రినాధరావు దంపతులతోపాటు దేవస్థానం వివిధ విభాగాల అధికారులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథోత్సవం అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణమండపం వద్దకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి పదిన్నర గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, భోజన వసతిని కల్పించారు. కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా భారీ స్క్రీన్‌లను ఏర్పాటుచేశారు. గట్టి పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటుచేశారు. అంబులెన్సులను, అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచారు. భక్తులు కొండ దిగువనుంచి పైకి వెళ్లేందుకు దేవస్థానం అధికారులు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని, అక్షింతలను ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంచారు.

కోడి వ్యర్థాల వ్యాన్ అడ్డగింత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో అనధికారికంగా కోడి వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను జివిఎంసి సిబ్బంది చినగదిలి వద్ద అడ్డుకున్నారు. వ్యాపారి మాత్రం సిబ్బంది మాట బేఖాతరు చేస్తూ ఆ వ్యాన్‌ను తీసుకుపోయాడు. జివిఎంసి 12వ వార్డు పరిధిలో ఆదివారం జరిగిన ఈ వ్యవహారంపై జివిఎంసి అధికారులు, వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి వేర్వేరుగా స్పందించడం విశేషం. ఆదివారం మధ్యాహ్నం ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోడి వ్యర్థాలను వ్యాపారి ఎపి 39 యుహెచ్ 5875 నెంబరు గల వ్యాన్‌లో బయటకు తరలిస్తున్నారు. అనధికారిక వ్యాన్‌లో వ్యర్థాలు తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రోహిణి జివిఎంసి జోన్ -2 ఎఎంహెచ్ఒ డాక్టర్ కిషోర్‌కు సమాచారం అందించారు. దీంతో అందుబాటులో ఉన్న జివిఎంసి సిబ్బందిని అక్కడకు పంపించి వ్యాన్‌ను అడ్డుకున్నారు. వ్యర్థాలను పరిశీలిస్తుండగానే సదరు వ్యాపారి వ్యాన్‌ను ముందుకు తరలించేసాడు. నిజానికి జివిఎంసిలో నమోదు చేసుకున్న నెంబరు గల వ్యాన్‌లో మాత్రమే ఈ వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాలి. కాని ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో సేకరించిన వ్యర్థాలను కాపులుప్పాడకు కాకుండా వేరే ప్రాంతాల్లో చేపల చెరువులకు తరలిస్తున్నట్టు వార్డు కార్పొరేటర్ ఆరోపిస్తున్నారు.

అనధికారికంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం..

ఆరిలోవ ప్రాంతం నుంచి కోడి వ్యర్థాలను అనుమతి తీసుకున్న నెంబరు గల వ్యాన్‌లో కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించేందుకు వ్యాపారికి అనుమతి ఉందని జివిఎంసి జోన్ -2 ఎఎంహెచ్ఒ డాక్టర్ కిశోర్ తెలిపారు. వేరే ప్రాంతాలకు తరలించడానికి వీలులేదని చెప్పారు. బయట ప్రాంతాలకు తరలిస్తున్నట్టు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారని, దీనిని పరిశీలించడానికి సిబ్బందిని పంపించామని చెప్పారు. సిబ్బంది పరిశీలిస్తుండగానే వ్యాన్‌ను తరలించారని, దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

గంగవరం కార్మికులకు రూ.36 వేలు ఇవ్వాలి

అఖిలపక్ష నేతలు డిమాండ్



సమావేశమైన అఖిలపక్ష రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గాజువాక : గంగవరం పోర్టు కార్మికుల ఆత్మహత్యలను ఆపాలని, కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని అఖిలపక్ష రాజకీయ, కార్మిక సంఘాల నేతలు డిమాండ్‌చేశారు. గాజువాకలోని ఎస్‌బిటి హోటల్‌లో ఆదివారం అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, గంగవరం పోర్టు యాజమాన్యం షాప్స్ అండ్ ఎస్టీప్లేస్మెంట్ ప్రకారం జీతాలు ఇస్తున్నామని చెబుతున్నారని తెలిపారు. అయితే పోర్టు షాపు కాదని, విదేశాల నుంచి కార్గో హ్యాండ్లింగ్ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. డాలర్లల్లో లావాదేవీలు జరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో జీతాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గంగవరం పోర్టు భారీ పరిశ్రమ కాబట్టి ప్రత్యేక వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని, లేకుంటే పక్కనే ఉన్న వైజాగ్ పోర్టులో మాదిరిగా జీతాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

కార్మికులు ఉద్యోగంలో చేరి 14 సంవత్సరాలు అయిందని, ఇప్పటికీ కనీసం 3 ప్రమోషన్లు ఇవ్వాలని తెలిపారు. కానీ ఒక్కరికి కూడా ప్రమోషన్ ఇవ్వలేదన్నారు. ఏటా పోర్టు లాభాల్లో నడుస్తోందని, వచ్చిన లాభాల్లో 20 శాతం బోనస్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నష్టాల్లో వున్న సరే కనీసం ఒక నెల జీతం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అలా కాకుండా ముష్టివేసినట్లు బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. పోర్టులో గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమే రిజిస్ట్రేషన్ అయి ఉందని, యూనియన్‌లో మెజార్టీ సభ్యులు ఉన్నారని చెప్పారు. గుర్తింపు యూనియన్‌గా గుర్తించి, చర్చలు జరిపి కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యాం కృషి చేయాలని కోరారు.

గంగవరం పోర్టులో 14 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కార్మికులకు రూ.13 వేలు నుంచి రూ.16 వేలు, 5 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.9 వేలు నుంచి రూ.9,800 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఉద్యోగంలో చేరినప్పుడు ఇచ్చిన రూ.3700 బేసిక్ మాత్రమే ఇప్పటికీ కొనసాగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసిత ఉద్యోగులు పేరుకే పర్మినెంటు తప్ప, జీత బత్యాలు దారుణంగా ఉన్నాయని తెలిపారు. విశాఖ పోర్టు, స్టీలుప్లాంట్‌లో పర్మినెంటు కార్మికులకు ఇస్తున్న వేతనాల్లో సగం కూడా గంగవరం పోర్టు కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలు, మెమోలు, ఛార్జ్‌షీట్లు ఇస్తూ ఉద్యోగాలు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

డిమాండ్లు

కార్మికులపై అక్రమ కేసుల పెట్టడాన్ని వెనక్కి తీసుకోవాలని, కనీస జీతం రూ.36 వేలు ఇవ్వాలని, అక్రమంగా ఉద్యోగం నుంచి తొలగించిన గంటిపిల్లి లక్ష్మయ్య, కదిరి భూలోకరావు, కారి అప్పారావును విధుల్లోకి తీసుకోవాలని, ఏటా 20 శాతం బోనస్, బోనస్ కనీసం నెల జీతం ఉండాలని, ప్రత్యేక మెడికల్ పాలసీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిఫరల్ హాస్పిటల్ సౌకర్యం ద్వారా హెల్త్ స్కీమ్‌ను ప్రకటించాలని, డ్యూటీకి ఒక గంట ముందు ఒక గంట తర్వాత ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు, అంగవైకల్యం చెందిన కార్మికులకు తక్షణ నష్టపరిహారం ప్యాకేజీని ప్రకటించాలని, వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, జిపిఎల్, జిపిఎస్ మధ్య అంతరాన్ని తొలగించి అందరినీ జిపిఎల్ కార్మికులుగా గుర్తించాలని, జిపిఎస్ కార్మికుల వేతనాల్లో, నిర్వాసిత కార్మికుల పట్ల వివక్షతను తొలగించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తి, చింతలపూడి వెంకట్రామయ్య, స్థానిక కార్పొరేటర్ గోవింద్‌రెడ్డి, శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు కెఎం.శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు సత్యనారాయణ, ఎఐటియుసి నాయకులు ఆదినారాయణ, ఐఎన్‌టియుసి నాయకులు మంత్రి రాజశేఖర్, గంగవరం పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ అప్పలరాజు, మాదా అప్పారావు, ఎల్లాజీ, అమ్మోరు,నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా యూనియన్ ప్రధాన కార్యదర్శి తాతారావు అందరికీ స్వాగతం పలికారు.

రైల్వే అండర్ పాత్‌వేను విస్తరించాలి

ప్రజాశక్తి -గాజువాక : తలారివానిపాలెం రైల్వే అండర్ పాత్‌వేను విస్తరించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రం అందించారు. కంచరపాలెం రామ్మూర్తిపేట, పాత గోపాలపట్నం, కొత్తపాలెం రైల్వే బ్రిడ్జిలను విస్తరించిన మాదిరిగా తలారివానిపాలెంలో చేపట్టాలని కోరారు. తలారివానిపాలెం వాసులు ఉన్నత పాఠశాలకు, పోస్టాఫీసుకు, విద్యుత్ బిల్లులు కట్టుకునేందుకు అగనంపూడి వచ్చేందుకు దువ్వాడ రైల్వే బ్రిడ్జి దాటుకొని ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించి రావాల్సి వస్తోందని వివరించారు తలారివానిపాలెం రైల్వే అండర్ పాత్‌వేను విస్తరిస్తే కేవలం రెండు కిలోమీటర్లు దూరంలోనే అగనంపూడి చేరుకుంటారని తెలిపారు. కార్లు, వ్యాన్లు, ఆటోల రాకపోకలకు తగ్గట్లు అండర్‌పాత్‌వేను విస్తరించాలని కోరారు.

జ్ఞాపికల ప్రదానం

ప్రజాశక్తి-సీతమధార : జివిఎంసి 24వ వార్డు పరిధి వివేకానంద కల్యాణ మండపంలో హెల్ది హోమ్ జిమ్ అధినేత ఆనంద్ తల్లి స్మారకార్థం నిర్వహించిన 7వ ఆంధ్ర రాష్ట్ర బాడీ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ముఖ్య అతిథిగా హాజరై వివిధ కేటగిరిలో ప్రథమస్థానం పొందిన ఆర్.గణేష్, సిహెచ్.దిలీప్, కె.మణికంఠ, కె.ఆనందరావు, ఎస్.చందుకు మెమొంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బాడీ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్, ప్రధానకార్యదర్శి కె.గణేష్, రెడ్డి, యశ్వంత్, ప్రదీప్, కిరణ్ పాల్గొన్నారు.



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న నాగభూషణం, సోమేష్

అన్న సమారాధన

ప్రజాశక్తి- ములగాడ మల్కాపురం బజార్‌వీధిలో పెద్దింటి అమ్మ వారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని ఐఎన్‌టియుసి నాయకులు బోగవిల్లి నాగభూషణం, టిడిపి వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతివారమూ అమ్మవారి ఆలయం వద్ద నగరాల సంఘం ఆధ్వర్యాన అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెఇపారు. ఈ కార్యక్రమంలో నగరాల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : కీర్తిశేషులు తిప్పల చినఅప్పారావు తృతీయ వర్ధంతిని పరిష్కరించుకొని ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ తిప్పల నితీష్‌రెడ్డి ఆధ్వర్యాన ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి విచ్చేసి తిప్పల చిన అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విలువలతో కూడిన రాజకీయవేత్త అన్నారు. గాజువాక వర్తక సంఘం అధ్యక్షునిగా పనిచేసి కార్మికులకు, యజమానులకు మధ్య సమన్వయకర్తగా వ్యవహరించారని తెలిపారు. చిన అప్పారావు చిరకాల కోరిక కళాసీ భవన నిర్మాణం అని పేర్కొన్నారు. ఎంపీ నిధులు రూ.15 లక్షలతో కళాసీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి, గొందేశి మహేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి భీమిలి జోన్ కృష్ణాకాలనీ, కుమ్మరిపాలెం వుడా లే-అవుట్‌లో ఉన్న తమ స్థలంలో వేసిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని పలువురు విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. ఈ మేరకు పల్లా రాజేశ్వరి, సత్యనారాయణ దంపతులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1986లో పలువురితో పాటు తాము కూడా సంబంధిత లే అవుట్‌లో ఇంటి నిర్మాణం నిమిత్తం స్థలం కొనుగోలు చేశామని, ఉద్యోగ రీత్యా దూర ప్రాంతాలకు వెళ్లిపోయామని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఇక్కడకు వచ్చి తమ స్థలాలను చూసుకుంటే ఆ స్థలంలో విద్యుత్ స్తంబాలు ఉండడంపై పలు దఫాలుగా స్పందనలో ఎపిఇపిడిసిఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం చేపడదామంటే విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. విద్యుత్ స్తంభాలు తొలగించడానికి రూ.75,739 అంచనా చార్జీల జాబితాను తమకు పంపించినట్లు తెలిపారు. తమ అనుమతి లేకుండా వేసిన విద్యుత్ స్తంభాలను ఇప్పటికైనా తొలగించాలని కోరారు.

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదలచేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యాన మాధవధారలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వస్తే ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో డైట్, బిఇడి చేసిన సుమారు 10 లక్షల మంది డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి, నిరుద్యోగుల ఆ త్మహత్యలకు కారణం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల పోస్టులకుపైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే విద్యాశాఖ మంత్రి మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు పరమావధిగా పరిపాలన చేస్తున్నారు తప్ప ఖాళీ పోస్టుల భర్తీపై ధ్యాస లేదన్నారు. ఈ కారణంగానే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు సరైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పాదయాత్ర సమయంలో యువతకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, విజయ, శరత్, మురళీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌కు బాసట

ప్రజాశక్తి -గాజువాక: షార్ట్ సర్క్యూట్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన విజయనగరానికి చెందిన ద్విచక్ర వాహన మెకానిక్ రాపాక కృష్ణకు గాజువాక ప్రగతి టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాసటగా నిలిచింది. కృష్ణకు చెందిన షెడ్, అందులోని 15 ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. నష్టపోయిన మెకానిక్ కృష్ణకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో జి.దామోదరరావు, వంగపండు గణేష్, సిమ్మిడి పైడిరాజు, రెడ్డిపల్లి రాజు, ఆకుల శ్రీనివాసరావు, రామకృష్ణ, పి.జయప్రకాష్ పాల్గొన్నారు.

93వ వార్డు వైసిపి పగ్గాలు ఎవరికో?

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు వైసిపి అధ్యక్షుని పగ్గాలు ఎవరికి దక్కుతాయోనని వార్డులో జోరుగా చర్చ నడుస్తోంది. వార్డు వైసిపి అధ్యక్షునిగా ఉన్న దాసరి రాజు ఇటీవల గుండె పోటుతో మృతిచెందారు. వైసిపి ఆవిర్భావం నుంచీ దాసరి రాజు పార్టీని నమ్ముకొని సేవలందించారు. గత సాధారణ ఎన్నికల్లో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు గెలుపునకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. అనంతరం జివిఎంసి ఎన్నికలు రావడంతో కొందరు వ్యతిరేకించినప్పటికీ పార్టీ తరుపున వార్డు కార్పొరేటర్ టిక్కెట్‌ను రాజుకే దక్కేలా ఎమ్మెల్యే మొగ్గుచూపారు. కార్పొరేటర్‌గా రాజు స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అయినా నిరాశ చెందకుండా వార్డు ప్రజలకు రాజు సేవలందిస్తూ వస్తున్నారు. రాజు గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడంతో వార్డు ప్రజలకు, ఎమ్మెల్యేకు తీరని లోటు అయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రాజు మృతితో వార్డు వైసిపి అధ్యక్ష పదవి ఎవరికి ఇస్తారనే చర్చ ప్రజల్లో ప్రస్తుతం నడుస్తోంది. దాసరి రాజు కుటుంబీకులకే ఎమ్మెల్యే పగ్గాలు అప్పగిస్తారా? లేక వార్డులోని సీనియర్ నాయకులకుగానీ, సామాజిక వర్గాల పరంగాగానీ మార్పులేమైనా చేస్తారా అని చర్చించుకుంటున్నారు.

4న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఇండస్ట్రియల్ కస్టమైజ్‌డ్ స్కిల్ ట్రైనింగ్, ప్లేసెమెంట్ ప్రోగ్రామ్‌లో యలమంచిలి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ పలు ఉద్యోగాలకు ఈ నెల 4వ తేదీన ద్వారకానగర్ 4వ లైన్‌లో ఉన్న కంపెనీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి చైతన్య తెలిపారు. బిఎస్‌సి కంప్యూటర్స్, డిప్లమో ఇన్ కంప్యూటర్స్, బిటెక్ కంప్యూటర్స్, ఎంసిఎ 2021-22 సంవత్సరంలో ఉత్తీర్ణులైన యువతీయువకులు హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారికి రూ.10 వేలు నుంచి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యనిర్వాహకుడు రమేష్ 9292553352ను సంప్రదించాలని సూచించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు సిఐ శ్రీనివాసరావు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వివాదాల్లో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. సమాజంలో సత్ప్రవర్తన, క్రమశిక్షణతో ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



గాంధీ కూరగాయల మార్కెట్లో మాట్లాడుతున్న బాలకృష్ణ

ప్రజాశక్తి -అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల ఐదున తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్లో సిఐటియు ఆధ్వర్యంలో కూరగాయల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో నిత్యవసర వస్తువులు ధరలు పెరిగేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వమే కారణమన్నారు. ప్రజలపై మోడీ ప్రభుత్వం పలు ఆర్థిక భారాలు వేస్తోందన్నారు. సిఐటియు అనకాపల్లి డివిజన్ కార్యదర్శి పిఎన్వి పరమేశ్వర రావు, బోర్ల గోవింద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.45 వేల కోట్ల బడ్జెటును చర్చ లేకుండా ఏడు నిమిషాల్లో ఆమోదింప చేయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలపై పన్నుల భారాలు పెరుగుతున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో పన్నుల భారాలకు వ్యతిరేకంగా కూరగాయల మార్కెట్లో కొత్తగా పెంచబోయే ఆశీళ్లను విరమించాలని, అలాగే కూరగాయల మార్కెట్లో మంచినీరు మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముందుగా ఇటీవల మతి చెందిన కూరగాయల వర్తకులు సూరిశెట్టి అప్పల నరసింహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోమవారం మార్కెటుకు బందు ప్రకటించారు. సమావేశంలో కూరగాయల సంఘం ప్రతినిధులు వెంకటలక్ష్మి, వర్తకులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఈ నెల 5న ఢిల్లీలో కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గొంతిన అప్పారావు ఆధ్వర్యంలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.చలో ఢిల్లీకార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని సిఐటియు రైతు సంఘం, కౌలురైతు సంఘం, మహిళా సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, బిల్డింగ్ కార్మిక సంఘం తరపున విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో గొంతిన అపాఎరావు(చంటి), పూడి అప్పలనాయుడు, గొంప ముత్యాల నాయుడు, ఏలూరి శ్రీను, గోపి సత్యం, నక్కా సన్యాసిరావు, ఎస్.



నర్సీపట్నంలో మాట్లాడుతున్న అడిగర్ల రాజు



సబ్బవరంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఎస్.త్రినాథ్. ఎస్ .అప్పారావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఈనెల 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్, నిర్మాణ యూనియన్ (సిఐటియు) కార్మికులకు సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మార్బల్, ఎలక్ట్రీకల్ వర్కర్స్, బలిఘట్టం భవన నిర్మాణ కార్మిక సంఘాలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చూస్తుందని, ప్రభుత్వ రంగం పరిశ్రమలను ప్రైవేటు పరం చేస్తుందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామ్యనులు బతకకుండా చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదికారం చేపట్టన నాటి నుండి భవన నిర్మాణ కార్మికల సంక్షేమ పథకాలు నిలిపివేసి, బోర్డ్ కార్మికల నగదును దారి మళ్లించిందన్నారు. మార్బుల్ కార్మిక సంఘం నాయకులు శ్రీనువాసరావు, అప్పారావు, అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా ప్రెసిడెంట్ కె.రామకృష్ణ, రమణ, ఎలక్ట్రికల్ యూనియన్ నాయుకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం



ఐదు దశాబ్దాల తర్వాత కలుసుకున్న 1973 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ హైస్కూల్లో 1973 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం ఆదివారం స్థానిక వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులు ఎల్ఎన్ శాస్త్రి, వెంకటరాజు లను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గత రెండేళ్లుగా తమ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలకు రూ.రెండు లక్షల 30 వేల విలువైన ఫర్నిచర్ ను అందించామన్నారు. పాఠశాల క్రమశిక్షణకు మారుపేరని, ఇక్కడ చదువుకున్న ఎంతోమంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో గురునాథరావు పాండురంగ, దొడ్డి వెంకట సత్యనారాయణ, బుద్ధ రామకష్ణ, సుధాకర్, శంకర్ నారాయణ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పాల్గొన్నారు.

కె. కోటపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 1984-85బ్యాచ్ పూర్వ విద్యార్థులు 38ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో చదువుకున్న విద్యార్థులు, విద్యాబుద్ధులు నేర్పించిన మాస్టార్లు ఆత్మీయ కలయికకు పాఠశాల వేదికైంది. ఉద్యోగ, వ్యాపారాలు, ఇతర రంగాల్లో స్థిరపడిన వారంతా కలుసుకుని పరస్పర క్షేమసమాచారాలను అడిగి తెలుసుకుని రోజంతా ఆనందా ఉత్సవాలలో మునిగి తేలారు. అప్పట్లో చదువుచెప్పిన ఉపాధ్యాయులు డబ్బురి నారాయణమూర్తి, సత్యరావు మాస్టారు, కృష్ణమనాయుడు, కుల్లయ్య మాస్టారు టీచర్లతో పాటు, ప్రస్తుత జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నారాయణమూర్తి, ఎం. సత్యారావు, స్కూల్ కమిటీ చైర్మన్ బోకర్ సత్యనారాయణలను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీక కలయికకు గుర్తింపుగా పాఠశాలలో సీసీ కెమెరాలు కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోరగా అందుకు పూర్వవిద్యార్థులు స్పందించి తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు తోటి విద్యార్థుల్లో చనిపోయిన వారికిసంతాపం వ్యక్తం చేశారు. ఇకనుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు పూర్వ విద్యార్థులు చిరికి రామకృష్ణ, సూరిశెట్టి ఈశ్వరరావు, కె.సూర్య ప్రకాష్, శరగడం నరసింహమూర్తి, బొబ్బిలి అప్పారావు, నీలి శ్రీను, కాకి వెంకట్రావు, చిరికి అప్పారావు, పీ బ్రహ్మాజీ, జి శ్రీనివాసరావు, గొల్లు ఈశ్వర రావు, ఈమంది ఈశ్వరరావు తెలిపారు



38ఏళ్ల తర్వాత కె.కోటపాడులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఉత్తరాంధ్ర మంత్రుల పిచ్చి ప్రేలాపనలు

టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్



మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉత్తరాంధ్ర మంత్రులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ, అనకాపల్లి టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మండిపడ్డారు. ఆదివారం. స్థానిక రింగ్ రోడ్డు పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైసిపి నేతలు, అమరావతి రైతుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. అమరావతి ప్రాంతంలో 29 గ్రామాల ప్రజలు 1200 రోజులుగా ఉద్యమిస్తున్నా ఒక ప్రజా ప్రతినిధి కూడా స్పందించకపోవడం శోచనీయం అన్నారు. వైసిపి ప్రభుత్వం అమరావతి భూములను తమ పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేయడానికి సిద్ధమవడం నీచాతి నీచమన్నారు. ఈ భూములను దోచుకోవడం పట్ల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన సిగ్గు రాకపోవడం దారుణమన్నారు.

వైసిపి ప్రభుత్వం నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్యేలు ఇపుడిపుడే వాస్తవాలు తెలుసుకొని అమరావతి రాజధాని గురించి సానుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని ప్రకటించిన జగన్‌రెడ్డికి, వైవి సుబ్బారెడ్డికి, పోటీలో నిలుచున్న అభ్యర్థులకు ఉత్తరాంధ్ర పట్టభద్రులు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఈ ఎన్నికల్లో ఓడినందున రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధ్యులైన మంత్రులు బొత్స, గుడివాడ, సీదిరి, ధర్మాన ప్రసాదరావు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింహారావు, ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ బాబర్ పాల్గొన్నారు.

కళాసీల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కళాసీలు

ప్రజాశక్తి - రాంబిల్లి : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అచ్యుతాపురం సెజ్ రాంబిల్లి మండలంలో ఉన్న కంపెనీల్లో నాన్ ఎస్ఇజెడ్ రుసిల్ డెకర్స్ పరిశ్రమ కళాసీలు సిఐటియు ఆధ్వర్యాన పరిశ్రమ గేటు వద్ద ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ పరిశ్రమకు భూములిచ్చిన నిర్వాసితులు గడచిన ఆరేళ్లుగా పరిశ్రమలో లోడింగ్ అన్‌లోడింగ్ పనులుచేస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు.

కార్మికులకు మామూలు ఇవ్వొద్దంటూ పరిశ్రమకు వచ్చే వాహనదారులకు సూచిస్తూ పరిశ్రమ యాజమాన్యం నిష్కర్షగా వ్యవహరించిందన్నారు. పాత పద్ధతిలో పనులు కల్పించాలని పరిశ్రమ యాజమాన్యానికి పలుమార్లు కార్మికులు కోరినా యాజమాన్యం నేడు రేపు అంటూ వాయిదా వేస్తూ వచ్చి, చివరకు మార్చి నెలాఖరు గడువు దాటినా సమస్య పరిష్కరించ లేదన్నారు. పాత పద్ధతిలో నిర్వాసితులను కళాసీ పనుల్లో కొనసాగించాలని ఎపిఐఐసి, కార్మికశాఖ అధికారులు ఆదేశించినప్పటికీ నేటికీ అమలు చేయకుండా నిర్వాసిత కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయకుంటేర కార్మికులందరినీ సమీకరించి ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. నిరసనలో గొర్లి నాగేశ్వరరావు, గొర్లి సత్తిబాబు, నానాజీ గుర్రం సూరిబాబు, ఎ అప్పలనాయుడు, కిషోర్ పాల్గొన్నారు

సుగర్ ఫ్యాక్టరీ సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : సుగర్ ఫ్యాక్టరీ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఆదివారం చోడవరం వైసిపి పార్టీ కార్యాలయంలో సుగర్ ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ నాయకులు తనను కలిసి, సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సుగర్స్ సమస్యలపై ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టితో ఫోనులో మాట్లాడారు.

గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటున్న ఫ్యాక్టరీని గాడీలో పెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు, ఈ ఏడాది చెరకు సరఫరా చేసిన రైతులకు నగదు చెల్లింపులు వంటి సమస్యలను పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. ఫ్యాక్టరీ స్థితిగతులపై కార్మిక నాయకులు భాస్కరరావు, తలారి సత్యనారాయణ, రామారావు సమస్యలను విన్నవించంతోపాటు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏడువాక నారాయణరావు, రాపేటి జగన్నాధరావు, బండి శ్రీను, గొల్లవిల్లి శ్రీను, పెంటారావు, రాజు, కృష్ణ, వసాధి రమణ పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని త్యేగాడ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కెజిబివి కశింకోట ప్రిన్సిపల్ డి చంద్రకళ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్సు (బడి మధ్యలో మానేసిన వారు)ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు . దరఖాస్తును https://apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం పండగ



బీచ్ రోడ్డులో ర్యాలీ చేస్తున్న జాన్‌వెస్లీ, క్రైస్తవులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు ఆదివారం క్రైస్తవ ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. 500 క్రైస్తవ సంఘాలు పాల్గొన్న ఈ ర్యాలీ నజరేన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సాగింది. జోసెఫ్ ప్రకాష్ నేతృత్వం వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టల ఆదివారం విశిష్టతను తెలియజేశారు. క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ జాయింట్ యాక్షన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం.అనిల్ పాల్, హోలీక్రాస్ చర్చ్ పాస్టర్ నెల్సన్ బాబు, వైసిపి ఎస్‌సి సెల్ విభాగం అధ్యక్షులు బోని శివరామకృష్ణ, వైసిపి నగర కార్యదర్శి ఈతలపాక శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. యేసు క్రీస్తును సిలువకు అప్పగించే ముందు యేరుషలేములోకి ప్రవేశించిన సందర్భాన్ని కళ్ళకు కట్టినట్లు తెలియజేస్తూ పిల్లలు, పెద్దలు ఈత మట్టలు చేతితో పట్టుకొని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో ప్రార్ధనలు జరిగాయి.దైవ సేవకులు జయరాజు వాక్య సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని శింగవరం గ్రామంలో జీసస్ మిరికల్ చర్చి వద్ద ఆదివారం మట్టల ఆదివారం పండుగ నిర్వహించారు పాస్టర్ జోషెఫ్ ఆధ్వర్యంలో శింగవరం గ్రామం నుండి అచ్చర్ల గ్రామం వరకు ఈతకొమ్మలు, పుల్లలకు పువ్వులు పెట్టి క్రైస్తవులు, చిన్నారులు ర్యాలీ చేశారు.

పాడిరైతుల సంక్షేమానికి ప్రాధాన్యత



పాడిరైతులకు శనగపప్పు అందిస్తున్న హెరిటేజ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -అచ్చుతాపురం : పాడిరైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ అధిక ప్రాధాన్యతనిస్తుందని డెయిరీ మేనేజర్ అన్నారు. ఆదివారం. రామన్నపాలెం గ్రామంలో సభ్య పాల రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, హెరిటేజ్ డెయిరీ అందిస్తున్న ప్రయోజనాలను రైతులకు వివరించారు. చోడమాంబిక అమ్మవారి పండగ సందర్భంగా 50 మంది పాడిరైతులకు ఒక్కొక్కరికి రెండు కేజీలు చొప్పున శనగపప్పును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మరెడ్డి అప్పలనాయుడు, ధర్మరెడ్డి కిషోర్, ధర్మరెడ్డి రాము, రెడ్డి చిన్న రాము, ధర్మరెడ్డి బాబురావు, శ్రీరాములు, రవణమ్మ, దరిమిరెడ్డి రాజులమ్మ రెడ్డి ప్రసాదు, లాలం శ్రీను పాల్గొన్నారు.

రేపు బుచ్చయ్యపేట మండల సమావేశం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : ఈనెల 4న మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఎంపిపి తాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన బుచ్చయ్యపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సువర్ణ రాజు తెలిపారు. సమావేశానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారన్నారు. సమావేశానికి జెడ్‌పిటిసి దొండా రాంబాబు, ఎంపిటిసి సర్పంచులు హాజరు కావాలన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, శాఖాపరమైన నివేదికలతో హాజరుకావాలని కోరారు.

త్వరితగతిన డైవర్షన్ నిర్మాణం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



డైవర్షన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది వద్ద శారద నదిపై డైవర్షన్ పనులు వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. ఆదివారం వడ్డాది వద్ద శారదానదిపై డైవర్షన్ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వడ్డాది శారద నదిపై వంతెన కుంగిపోవటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ు. కొద్దిరోజులపాటు వాహనాలు పూర్తిగా నిషేధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. దీంతో ఎమ్మెల్యే ధర్మశ్రీ స్పందించి, కుంగిపోయిన కల్వర్టు రంధ్రాలను అప్పట్లో రాళ్లు మట్టితో కప్పి తాత్కాలిక మార్గం ఏర్పరిచారు.

కానీ వంతెనపై కుంగిన రంధ్రాలను బండరాళ్లతో కప్పేసి వాహనరాకపోకలను పునరుద్ధరించినప్పటికీ, నేటికీ అపుడపుడు అంతరాయం తప్పడం లేదు. ఈ నేపథ్యంలో వంతెనకు సమాంతరంగా కిందవైపున పైపులతో డైవర్షన్ పనులుచేపడుతున్నారు. సంబందిత పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, వాటి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి, ఉప సర్పంచ్ దాడి సూరినాగేశ్వరరావు పాల్గొన్నారు

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న యువ వ్యాపారులు

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో గవరపేట వీధి శ్రీ రామాలయ అభివృద్ధికి యువ వ్యాపారవేత్తలు బొడ్డపాటి రామకుమార్, బొడ్డేడ నాగేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ కమిటీ పెద్దలు మాదేటి రామునాయుడు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గుండాల వీధిలోని వారి కార్యాలయంలో కలవగా, స్పందించిన రామకుమార్, నాగేశ్వరరావు ఆలయంలో టైల్స్ ఏర్పాటుకు రూ.లక్ష వితరణ అందజేశారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సీతారాం, నరసింగరావు మాస్టర్, కొణతాల గోవిందరాజులు మాస్టర్, విశ్వేశ్వరరావు, పీలా బుజ్జి పాల్గొన్నారు.

'ఉపాధి' ప్లాంటేషన్ వేగవంతం చేయండి



రీసర్వేను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సందీప్

ప్రజాశక్తి-సబ్బవరం : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ప్లాంటేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పిడి ఇ.సందీప్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం రాయపుర అగ్రహారంలో సమగ్ర భూరీసర్వేలో సరిహద్దు రాళ్ళను రెవెన్యూ, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఏర్పాటు చేయగా, సర్వే తీరును డ్వామా పీడీ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, మండల సర్వేయర్ కె. శ్రీనివాసరావు, ఎపిఒ ఎం. శ్రీనివాసరావు, విఆర్ఒ అప్పారావు, టిఎ జి. విశాలాక్షి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు హైమ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

భూతగాదాలో ఇరుగ్రూపుల దాడి

తహశీల్దార్ సమక్షంలోనే బాహాబాహి

కత్తితో హల్‌చల్ చేసిన ఎఆర్ కానిస్టేబుల్

పలువురికి గాయాలు : కేసు నమోదు



కత్తితో దాడి చేస్తున్న ఎఆర్ కానిస్టేబుల్ అప్పలనాయుడు

ప్రజాశక్తి -చోడవరం : భూతగాదా విషయమై మండలంలో గవరవరంలో ఇరువర్గాలకు చెందినవారు తహశీల్దార్ సమక్షంలోనే పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఆర్ కానిస్టేబుల్ వంకల అప్పలనాయుడు ప్రత్యర్థులపై పెప్పర్ స్ప్రే చేసి, కత్తితో దాడి చేసి ఐదుగురిని గాయపరిచాడు, దీంతో అక్కడున్నవారు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. దాడి చేసిన అనంతరం అప్పలనాయుడు అక్కడనుండి పరారయ్యాడు. బాధితులను తహశీల్దార్ బి తిరుమలబాబు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అక్కడనుండి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరస్పర ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు చెందిన 17 మందిపై చోడవరం పోలీసులు కేసులు నమోదు చేశారు. స్థానిక సిఐ బి శ్రీనివాసరావు అందించిన వివరాలు. గవరవరం గ్రామంలో చొప్పదండి దేవుడు నాయుడు, ఉప్పుల అప్పారావుకు భూతగదా విషయమై భూమి పరిశీలనకు ఆదివారం తహశీల్దార్ బి.తిరుమలబాబు సిబ్బందితో వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సమక్షంలోనే ఇరు వర్గాలకు చెందినవారు ఘర్షణ పడటంతోపాటు పరస్పరం కర్రలు కత్తులతో దాడి చేసుకున్నారు.. ఉప్పుల అప్పారావు సంబంధించిన వ్యక్తి వంకల అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు చప్ప గడ్డిదేమున్నాయుడు, అర్జున్, అప్పల నాయుడు, జొన్నపల్లి వెంకటరమణ, దేవుడు నాయుడు, మజ్జి రమణ, అప్పలస్వామి, ఏరుకు నాయుడు, అన్నం వెంకటరమణ, గుమ్మాల సత్తిబాబు, చప్ప గడ్డి శ్రీను, గుమ్మాల ఈశ్వరావులపై కేసు నమోదు చేయగా, చప్ప గడ్డి నాయుడు ఫిర్యాదు మేరకు వంకల అప్పల నాయుడు, ఉప్పుల అప్పారావు, లక్ష్మణ, నాగరాజు, బాలి పోయిన వెంకటరత్నంపై కేసు నమోదు చేశామని సిఐ తెలిపారు. గ్రామంలో ఇటువంటి తగాదాలు జరక్కుండా పోలీసులు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

బాలల అభ్యున్నతికి

మకరెంకో కృషి అమోఘం

ప్రజాశక్తి- చోడవరం : సోవియట్ యూనియన్‌లో అత్యంత ప్రతిభావంతమైన విద్యా సిద్ధాంతకర్త, ఉక్రెనియన్, సోవియట్ విద్యావేత్త, సామాజిక కార్యకర్త ఆంటోన్ సెమినోవిచ్ మకరెంకో వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్ఎస్‌పి డిగ్రీ కాలేజీలో జనసాహితి శాఖ నిర్వహణలో 'నేటి విద్యారంగ పరిస్థితులు సమాలోచన' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు సమన్వయకర్తగా వ్యవహరించిన జనసాహితి సభ్యులు ఎ.రవిశంకర్ మాట్లాడుతూ, 20వ శతాబ్దపు తొలిదశకాలలోనూ, ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో రష్యా, యూరోపియన్ దేశాలలో తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో ఛిద్రమైపోయే బాల్యాన్ని కాపాడడం కోసం, త్యాగపూరితమైన కృషి చేసిన వారిలో ఆంటోన్ మకరెంకో అగ్రగణ్యుడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సూర్య ప్రకాష్, ఖండేల వెంకటరావు,. కసిరెడ్డి వాసు, ఇ.పెంటారావు, నాగరాజు, గణేషు, మత్స్యలింగం, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతకు కృషి



సర్టిఫికెట్లతో శిక్షణార్థులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రతి గ్రామంలో 14 నుంచి 60 ఏళ్లవయసు గల వారిని డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ జిల్లా మేనేజర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల గ్రామంలో కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ కె శివ, విఎల్ ఇ.వెంకటరావు మాట్లాడుతూ గ్రామంలో 130 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, వారిలో 70 మంది ఉత్తీర్ణులు అయినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు గహిణులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ మాస్టర్ బొడ్డేడ జోగినాయుడు, వాలంటీర్ అప్పికొండ శ్రావణి పాల్గొన్నారు.

వాసవీ సతీష్‌కు ఘనసత్కారం



సతీష్ ను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం వాసవి క్లబ్ సభ్యులు, జోన్ చైర్మన్ పూసర్ల సతీష్‌ను ఆదివారం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పసుమర్తి హరిబాబు, వాసవి క్లబ్ అధ్యక్షులు పసుమర్తి శేష అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ వాసవి క్లబ్, వనితా క్లబ్ సంబంధించిన సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమలో సెక్రెటరీ పుట్టా నరేష్, ట్రెజరర్ భోగవిల్లి గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల వార్షిక కల్యాణం

ప్రజాశక్తి - యలమంచిలి:శ్రీరామనవమి సీతారాముల కల్యాణం అనంతరం నిర్వహించే ఏకాదశి వార్షిక కల్యాణోత్సవానికి శనివారం ఆర్ధరాత్రి ఎదురు సన్నాహక కార్యాక్రమం నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను వేద పండితులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు కలిసి పల్లకిలో ఊరేగింపుగా రామనగర్‌లోని సీనియర్ సివిల్ జడ్జి ఇంటికి చేరుకున్నారు. అక్కడ ఎదురు సన్నాహక పూజాకార్యక్రమాలు ముగించారు.

కల్యాణ వేడుకలో జూనియర్ సివిల్ జడ్జి స్వాతి భవాని దంపతులు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వీర రాఘవేందరరావ్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాంభశివరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ తోట కృష్ణవేణి, అధిక సంఖ్యలో లాయర్లు, మహిళలు పాల్గొన్నారు. ముగ్గురు న్యాయమూర్తులు ఒకే వేడుకలో పాల్గొనడంతో భక్తులు ఆసక్తిగా తిలకించారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

-పిడుగు పడి రెండు పాడి పశువులు మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్క పోతతో కూడిన ఎండ కారణంగా ప్రజలు అల్లాడిపోయారు. రెండు గంటల నుంచి ఒకసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లాయి. పలు ప్రాంతాల్లో



కోటవురట్లలో రోడ్డుపై వర్షపు నీరు

రోడ్లపై నీరు చేరింది. గాలులతో కూడిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు అన్నారు. మండల కేంద్రంలో మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో సీతారామరాజు నగర్‌లో మురుగు నీరు ఇళ్లలోకి చేరింది. ఎంపిడీవో కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలిచి పోయింది. దీంతో, వాహనదారులు అవస్థలు పడ్డారు.

నక్కపల్లి:మండలంలోని జి.జగన్నాధపురం పంచాయతీ సీతానగరంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి రెండు పాడి పశువులు మృతి చెందాయి. పశువులు మేపుతున్న ప్రగడ చక్రవర్తి పిడుగుపాటుకు స్వల్పంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై అరగంట ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది.



మృతి చెందిన పశువు



గంటాను సన్మానిస్తున్న బాబ్జి రాజు, నేతలు

నూకాలమ్మను దర్శించుకున్న గంటా

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు గ్రామంలో నూకాలమ్మను విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల పరిషత్ మాజీ ముఖ్య సలహాదారులు కల్లేపల్లి బాబ్జి రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గంటాకు ఘన స్వాగతం పలికారు. బాబ్జి రాజు తన కుటుంబ సభ్యులతో గంటాకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. వేంపాడులో బాబ్జి రాజు తన స్వగృహమునందు విందు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గంటాను కలిశారు. గంటాను కలిసిన వారిలో జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, జనసేన నేత గెడ్డం బుజ్జి, విశాఖ డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, తెలుగుదేశం పార్టీ నాయకులు బుల్లి చంటి, కొప్పిశెట్టి కొండబాబు, వినోద్ రాజు, మీగడ సత్తిబాబు, కొప్పిశెట్టి బుజ్జి, కాశీ నాయుడు, వైసిపి నాయకులు మణిరాజు, పాపారావు, ఈశ్వరరావు, గోవిందలు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

'రణభేరి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కోటవురట్ల:ఈనెల 16న విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సామాజిక విప్లవ రణభేరి పోస్టర్‌ను ఆదివారం జై భారత్ ఆధ్వర్యంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయ భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి రమణ, జై భారత్ ఎస్సి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, జయహో రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి వెంకటరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బోడపాటి రవికుమార్ పాల్గొన్నారు.

అయ్యన్నా..అభివృద్ధి కనిపించలేదా ?

వైసిపి నేతల ప్రశ్న

ప్రజాశక్తి-గొలుగొండ:వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్షపాతం లేకుండా అర్హులందరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందుతున్నాయని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి మాజీ మంత్రి అయ్యన్నకు కనిపించ లేదా అని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జడ్పిటీసీ సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ ప్రశ్నించారు. మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు ఎక్కడ అభివృద్ధి జరగలేదంటూ లేనిపోని ఆరోపణలు చేయడంపై ఆదివారం పాత కృష్ణదేవిపేటలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. శనివారం ' రాత్రి పుత్తడిగైరంపేట గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేమి కర్మ రా కార్యక్రమంలో మాజీ మంత్రి అయ్యన్న పాల్గొన్నారు. ఈ సమావేశంలో పుత్తడిగైరంపేటలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అయ్యన్న ఆరోపించడంపై మండల నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి, పుత్తడిగైరంపేట సర్పంచి పత్తి రమణ మాట్లాడుతూ,



మాట్లాడుతున్న వైసిపి నేతలు

చిన్న పంచాయతీగా ఉన్న పుత్తడి గైరంపేట లో 2020 నుండి ఇప్పటి వరకు వరకు రెండు కోట్లు 52 లక్షల మేర అభివద్ధి పనులు చేసామన్నారు. గతంలో ఎప్పుడూ లేనంత అభివద్ధి ఈ మూడు సంవత్సరాల్లోనే చేశామని ఆయన అన్నారు. ఇప్పటి వరకు ఈ పంచాయతీలో 20 సంవత్సరాల నుండి ఒక్క వార్డు మెంబర్ కూడా టీడీపీ గెలవలేదన్నారు. అయ్యన్న తప్పుడు ఆరోపనలు మానుకోవాలన్నారు. ఇటువంటి ఆరోపనలు చేస్తే ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓడించి మరలా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.



చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయం లో చిల్డ్రన్స్ క్లబ్ సందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా యోగ విద్యను అభ్యసించిన విద్యార్థులు కళ్ళకు గంతలు కట్టుకొని రివర్స్ లో చూపించిన పేపర్స్ చదివి పాఠకులను అబ్బు రపరిచారు. అనంతరం గ్రంధాలయ అధికారిణి దమయంతి పిల్లలతో కథల పుస్తకాలు చదివించి అందులో వున్న నీతిని వివరించారు. గ్రంథాలయంలో అన్ని రకముల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచామని, కాంపిటీటివ్ కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు ఉపయోగించు కోవాలన్నారు.

పథకాలపై ఇంటింటా ప్రచారం

మండల సచివాలయ కన్వీనర్ పాణీ శాంతారామ్

ప్రజాశక్తి-గొలుగొండ:సిఎం జగన్మోహన్‌రెడ్డి అంది స్తున్న పథకాలపై ఈనెల 7 నుండి గ్రామ గృహసారధులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని మండల సచివాలయం కన్వీనర్ కొరుప్రోలు పాణీశాంతారామ్ కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం కృష్ణదేవి పేట, నాగాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల్లో గృహ సారధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహ సారథులకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రజల నుంచి సేకరించాల్సిన సమాచారాన్ని ఎలా తీసుకోవాలో ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జడ్పీటిసి సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ, స్థానిక సర్పంచ్‌లు యలమంచిలి రఘురాం, సత్యంనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతారామ్

ఇసుక రవాణాపై నిఘా

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో సోముదపల్లి గ్రామంలో అక్రమం గా రవాణా చేస్తున్న ఇసుక బస్తాలు గమనించిన తహ శీల్దార్ శ్యాం కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి నిఘా పెట్టాలని ఎస్ఐ కి ఆదేశాలు జారీ చేశారు.



పట్టుబడిన ఇసుక బస్తాలు

వైవి.సుబ్బారెడ్డికి వినతులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసీపీ నేతలు కోరారు. కాకినాడ నుండి విశాఖపట్నం వెళ్తున్న టిటిడి పాలక మండలి చైర్మన్ వై వి.సుబ్బారెడ్డిని ఆదివారం నక్కపల్లి జంక్షన్ వద్ద కలిశారు. వీసం రామకష్ణ ఆయనకు వెంకన్న జ్ఞాపికను అందజేశారు.2018 లో వెంకన్న ఆలయాన్ని టీటీడీ లోకి విలీనం చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ రత్న కుమారి, వైసిపి నాయకులు వీసం రాజు, అల్లాడ కొండ, కొల్లాటి బుజ్జి, ఎల్లెటి సత్యనారాయణ, బంగారురాజు,తాతారావు తదితరులు పాల్గొన్నారు .

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నక్కపల్లి:జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్, టిటిడి బోర్డు చైర్మన్ వై.వి సుబ్బారెడ్డిని జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కొరడ చంద్రరావు కోరారు. కాకినాడ నుంచి వై.వి సుబ్బారెడ్డి విశాఖపట్నం వెళ్తుండగా మార్గ మధ్యలో నక్కపల్లి జంక్షన్ వద్ద ఆదివారం చంద్రరావు కలిసి మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారాన్ని కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



వైవి సుబ్బారెడ్డికి సమస్యలను విన్నవిస్తున్న జర్నలిస్టులు

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ 2వ వార్డు బిసి కాలనీలో జనసేన నేతలు అద్దేపల్లి గణేష్, సూర్యచంద్ర సమక్షంలో బిసి కాలనీకి చెందిన వైసిపి నాయకులు మొండి శివ నేతృత్వంలో ఆ పార్టీలో చేరారు. ఈ మేరకు సూర్యచంద్ర పార్టీ కండువా చేసి సాధనంగా ఆహ్వానించారు. 2024 ఎన్నికల తర్వాత వైసిపి పార్టీ ఖాళీ అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో అధికారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల నాయకులు నమ్మి రమణరాజు, ప్రోగ్రాం కమిటీ మెంబర్ కొత్తకోట రామశేఖర్, 13వ వార్డు ఇన్చార్జ్ మూడెపు తాతబాబు, లంక పాత్రుడు, మాద్రెడ్డి వెంకటరమణ, చిరంజీవి శ్రీను పాల్గొన్నారు.


దగ్ధమవుతున్న గడ్డివామి

పశువుల పాకలు దగ్ధం

- రెండు జీవాలు మృతి
- మూడింటికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: తంగేడు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో రైతు సింగంపల్లి శ్రీనుకు చెందిన రెండు గడ్డివాములు, రెండు పశువుల పాకలో దగ్ధమయ్యాయి ఈ ప్రమాదంలో ఆవుపెయ్య, గొర్రె పోతు మృతి చెందగా, మూడు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక రైతులు పశువుల అంబులెన్స్ కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గాయపడ్డ పశువులకు చికిత్స అందజేశారు.


పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక (లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం) శివాలయంలో శివ, పార్వతుల కళ్యాణం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. వేద పండితులు మంత్రోచ్చారణతో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేష్, వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాద్ ఆచార్యులు పెండ్లిని చేపట్టారు.రాత్రి 10 గంటల నుండి 12.30 గంటల వరకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు గ్రామంలో సీతారామస్వామి కళ్యాణం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం తోడుపెద్దిని ఆలయంలో స్వామి వారి సన్నిధిలో ఉంచి కళ్యాణంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చేకూరి శ్రీరామచంద్రరాజు, కొరపాటి గోపాలం, పుట్టా సుధాకర్, కోరా రామారావు, రాజు పాల్గొన్నారు.

నగదు అప్పగింత

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లికి చెందిన ఎస్.చంద్రిక విశాఖలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తుంది. ఆదివారం విశాఖ నుండి నక్కపల్లి బయలు దేరి వచ్చింది. హ్యాండ్ బ్యాగ్ బస్సులో మర్చి పోయి నక్కపల్లిలో దిగింది. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చిన వెంటనే ఎస్ఐ శిరీష స్పందించి హైవే మొబైల్ సిబ్బందితో బస్సును నిలుపుదల చేసి బ్యాగును స్వాధీన పరచుకున్నారు. బ్యాగ్‌లో ఉన్న రూ.7 వేల నగదు, పావు తులం బంగారాన్ని చంద్రికకు అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఈ మేరకు ఎస్ఐ శిరీష హైవే మొబైల్ సిబ్బంది కె.అప్పారావు, తిరుపతిరావులను అభినందించారు.

'జాబ్ కేలండర్ విడుదల ఏదీ ?'

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని ముఖ్యమంత్రి జగన్ మాయమాటలు చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే గడ్డి ఈశ్వరి విమర్శించారు. ఆదివారం పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2.30 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మాట తప్పారని, గత టిడిపి ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగ భృతిని రద్దు చేశారని ఆరోపించారు.

జి 20 పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

- పట్టణ మౌలిక సదుపాయాల ప్రైవేటీకరణకు తెరలేపిన సమ్మిట్
- సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో నాలుగు రోజులపాటు ఆర్భాటంగా జరిగిన జి 20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమ్మిట్‌లో పట్టణ మౌలిక సదుపాయాలను పూర్తిగా ప్రైవేటుపరం చేయాలని నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగించే అంశమని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ సదుపాయాల ప్రైవేటీకరణను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, ఉన్న సదుపాయాలు కూడా అత్యంత నాసిరకంగా ఉన్నాయని చెబుతూనే దీనికి పరిష్కారంగా ప్రైవేటు పెట్టుబడులను పట్టణ మౌలిక సదుపాయాల రంగంలోకి ఆహ్వానించాలని పేర్కొనడం దారుణమన్నారు. భవిష్యత్తులో మంచినీరు, పారిశుధ్యం, పార్కులు, ఖాళీ స్థలాలు, ఫంక్షన్ హాళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు తదితరాలన్నీ ప్రైవేటుపరం కానున్నాయన్నారు. ఆ నిర్ణయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించడం చాలా ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఇప్పటికే ముడసర్లోవ పార్క్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి సిద్ధం చేశారని, త్వరలోనే శివాజీ పార్క్, బిఆర్‌టిఎస్ రోడ్డులను ప్రైవేటుపరం చేయనున్నారని అన్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంతో పదేళ్లకు ప్రైవేటు సంస్థలకు ఇచ్చారన్నారు. పన్నులన్నీ విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. జి 20 సదస్సుకు జివిఎంసి ఏకంగా రూ.157 కోట్లు ఖర్చు



చేసిందన్నారు. ఇలా ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచడం తగదన్నారు. ఖర్చు చేసిన దానిలో మితిమీరిన అవినీతి చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ ఖర్చు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సి ఉన్నా ఆ పని జరగలేదన్నారు. ప్రజల పన్నుల ద్వారా చెల్లించిన సొమ్మును జివిఎంసి ఈ విధంగా దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఖర్చుపై అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లు లేదా స్వతంత్ర సంస్థలచే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

టిడిపితో రాష్ట్రం అభివృద్ధి

మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి గొలుగొండ: రాష్ట్రం మళ్ళీ అభివృద్ధి బాట పట్టాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమని ఆ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణదేవిపేట, కొంగసింగి గ్రామాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ, జగన్ బూటకపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు మద్యనిషేధం, ప్రతి ఇంటికి సన్న బియ్యం ఇస్తానని చెప్పిన జగన్ ఇప్పటికీ వాటిని అమల్లోకి తేలేక పోయారన్నారు. ఎక్కడ చూసినా రాష్ట్రంలో నాటు సారా విపరీతంగా పెరిగి పోయిందని అన్నారు. ఆదాయాన్ని చూసుకోకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోనికి తీసుకెళ్లారని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు టీడీపీ హయాంలోనే


మాట్లాడుతున్న అయ్యన్న

నిర్మాణం చేశామన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, వచ్చే ఏడాది జగన్ జైలుకేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, సర్పంచ్లు అదపురెడ్డి గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్లు సుర్ల బాబ్జీ, మాజీ ఎంపిటిసి చింతల నారాయణమూర్తి నాయుడు, స్థానిక నాయకులు రమణ, బుజ్జి, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న ఆశా జాస్తి

ఆశా జాస్తికి నారీ పురస్కారం

ప్రజాశక్తి - విశాఖపట్నం : విశాఖ నగరానికి చెందిన సన్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తికి నారీ పురస్కార్ - 2023 లభించింది. ఇటీవల హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎపి పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా చేతులమీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఇప్పటికే అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను విద్యా శాఖాధికారులు పూర్తిచేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : పద్మనాభంలో 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు నాలుగో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు, పద్మనాభం ఎంఇఒ శివరాణి తెలిపారు. మద్ది, పద్మనాభం, రెడ్డిపల్లి, రేవిడి పరీక్షా కేంద్రాల్లో మండలంలోని గంధవరం, అనంతవరం, విజయానందపురం, బిఆర్ తాలవలస, పద్మనాభం కేజీబీజీ పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి 676 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించినట్లు పేర్కొన్నారు.

మండల కేంద్రమైన పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం మధ్యాహ్నం నుంచి ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు శివరాణి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 169 మంది ఈ పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.

ఆనందపురం : మండలంలో పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్లు ఎంఇఒ అమృత బాలామణి తెలిపారు. మండలంలోని 11 హైస్కూళ్లు, ఒక కేజీబీవీ పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1090 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఐదు కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు, సొంట్యాం, బోయపాలెం, పెద్దపాలెం నారాయణ హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోటవురట్ల: ఈనెల 3 నుండి మండలంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ అప్పారావు తెలిపారు. ప్రభుత్వ హై స్కూల్లో 240, బాలికల హైస్కూల్‌లో 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఎస్.రాయవరం: పదవ తరగతి పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు అనుమతి నిరాకరిస్తామని మండల విద్యాశాఖాధికారి ఏఎస్ యస్ఏఎస్ మూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మండలంలో పరీక్షల నిర్వహణకు ఐదు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 542 మంది బాలురు, 575 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారన్నారు. అన్ని సెంటర్లలో మౌలిక వసతులు సమకూర్చామన్నారు. ప్రతి సెంటర్‌లో 144 సెక్షన్, వైద్య సౌకర్యం కల్పించుటకు చర్యలు చేపట్టామన్నారు. కేంద్రాల్లోకి ఎవరూ కూడా మొబైల్ ఫోన్లు పట్టుకెళ్లరాదని తెలిపారు. పరీక్ష కేంద్రానికి దగ్గరగా ఉన్న జిరాక్స్ సెంటర్‌లు తెరవరాదని ఎంఈఓ మూర్తి తెలిపారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి...

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలో ఈ నెల 3 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం లో 356 మంది, అలాగే దిబ్బిడి ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రంలో 220 మంది, మొత్తంగా 586 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 .45గంటలకు ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 9.30 సమయం దాటితే పరీక్షలకు అనుమతించడం జరగదన్నారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

యలమంచిలి : మండలంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు మొదలయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఇఒ విశ్వనాథం తెలిపారు. యలమంచిలి పట్టణంలో 900 మంది, రూరల్ మండలంలో మరో 200 మంది పదవ తరగతి విద్యార్థులున్నారన్నారు. పట్టణ విద్యార్థులు సెయింట్ మేరీ హైస్కూలు, గరల్స్ హైస్కూలు, చైతన్య, కొత్తపేట హైస్కూలు పరీక్ష కేంద్రాలు కేటాయిచంగా, పులపర్తి, ఏటికొప్పాక, సోమలింగపాలెం విద్యార్థులు దిమిలి, దార్లపూడి హైస్కూలులో గ్రామీణ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. పరీక్షలు జరిగే కేంద్రాల్లో 144 సెక్షను అమల్లో ఉంటుందన్నారు.. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్‌లైట్లు, ఫ్యాన్స్, మంచినీరు, టాయిలెట్స్, ఫస్ట్ ఎయిడ్ తదితర సౌకర్యాలను కల్పించామన్నారు.. చైతన్య, సెయింట్ మేరీ పాఠశాల పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు. త్రీ మెన్ కమిటీని నియమించారు. జిల్లా కలెక్టరు, డిఇఒ ఆదేశాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిఇఒ తెలిపారు.


యలమంచిలిలో పరీక్షల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న త్రిమెన్ కమిటీ